

సాక్షి
పల్నాడు
శనివారం । 21 । జనవరి । 2023



పశ్చిమకు 1416 క్యూసెక్కులు

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ కాలువకు శుక్రవారం 1416 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. వీటిని వేర్వేరు కెనాల్స్ పంపిణీ చేశారు.



పులిచింతలలో 43 టీఎంసీలు

అచ్చంపేట: పులిచింతలలో ప్రస్తుత నీటి నిల్వ 43.2071 టీఎంసీలు. ప్రాజెక్టు ఎగువ నుంచి 6709 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా దిగువకు 2200 వదులుతున్నారు.

జీరో కరోనా



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ప్రతిభాపాటవాలు పెంచేందుకే పీఎంశ్రీ కార్యక్రమం

స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ పార్వతి



నాదెండ్ల: విద్యలో మరింత శాస్త్రీయత, ఆధునికతను జోడించి విద్యార్థుల్లో ప్రతిభాపాటవాలు పెంపొందించేందుకు పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం–శ్రీ) కార్యక్రమం అమలు చేస్తున్నట్లు స్కూల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్ పి.పార్వతి చెప్పారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి పీఎం–శ్రీ కార్యక్రమం అమలు కానున్నట్లు తెలిపారు. ఈ పథకానికి సంబంధించి డాక్యుమెంట్ వెరిఫికేషన్ నిమిత్తం శుక్రవారం పాఠశాలను సందర్శించారు. స్కూలు, విద్యార్థుల వివరాలు నమోదు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా రూ.27360 కోట్లతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఐదేళ్ల పాటూ ఈ పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకంలో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన విద్య, మరింత మెరుగైన వసతులు, అంతర్జాతీయ ప్రమాణాల అమలు చేయనున్నట్లు తెలిపారు. హెచ్‌ఎం పీవీఎంవీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమగ్రశిక్ష ఏపీసీగా విజయలక్ష్మి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్తగా డెప్యూటీ కలెక్టర్ కేడర్‌లో ఉన్న జి.విజయలక్ష్మిని నియమిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

పులిచింతల స్పెషల్ డెప్యూటీ కలెక్టర్‌గా శ్రీరాములు

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా కందుల శ్రీరాములను నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ (ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్)నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. డెప్యూటీ కలెక్టరుగా ఉన్న శ్రీరాములు పదోన్నతిపై స్పెషల్ డెప్యూటీ కలెక్టరుగా నియమితులయ్యారు. అదే విధంగా పల్నాడు జిల్లా డిప్యూటీ కలెక్టరుగా ఉన్న కె.మాధురి బదిలీ అయ్యారు.

కేఆర్‌ఆర్‌సీ డెప్యూటీ కలెక్టర్‌గా వెంకట శివరామిరెడ్డి


గుంటూరు వెస్ట్: రాష్ట్రంలోని పలువురు డెప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు కేఆర్‌సీసీ డెప్యూటీ కలెక్టర్‌గా వెంకట శివరామిరెడ్డిని నియమించారు. ఇటీవల జిల్లా నుంచి పదోన్నతి పొందిన పెంచుల ప్రభాకర్‌ను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ రెవెన్యూ విభాగానికి బదిలీ చేశారు. వాకా శ్రీనివాసులు రెడ్డిని విజయవాడ టూరిజం రీజనల్ డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు.

యార్డులో 75,897 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): స్థానిక మిర్చియార్డుకు శుక్రవారం 70,514 మిర్చి బస్తాలు రాగా, గతనిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 75,897 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.26,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.28,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 35,141 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వర రెడ్డి తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 572.40 అడుగుల వద్ద ఉంది. ఇది 262.5944 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 10,567, ఎడమకాలువకు 6,478, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 8,778, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరదకాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 28,543 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 28,543 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 845.30 అడుగుల వద్ద ఉంది. ఇది 70.6282 టీఎంసీలకు సమానం.

గృహం.. ప్రతిష్టాత్మకం

- 10 రోజుల్లోగా భూమి చదును కావాలి
- మళ్లీ వస్తా.. పనుల్లో పురోగతి ఉండాలి
- జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశం



గృహ నిర్మాణాలపై కలెక్టర్ శివశంకర్‌కు వివరిస్తున్న పీడీ వేణుగోపాల్

సత్తెనపల్లి: పక్కా గృహనిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా సత్తెనపల్లి మండల పరిధిలోని భీమవరం రూరల్, భీమవరం అర్బన్, గండ్లూరు వద్ద నిర్మాణ దశలో ఉన్న జగనన్న లేవట్లను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. భీమవరం రూరల్ పరిధిలో నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీలో భూమి చదును కార్యక్రమం సకాలంలో పంచాయతీరాజ్ శాఖ చేయనందున గ్రౌండింగ్ చాలా తక్కువగా ఉన్నదని 107 గృహాలకు గాను 34 గృహాలు మాత్రమే బేస్మెంట్ లెవల్‌కు రావడం జరిగిందని చెప్పడంతో భూమి చదును కార్యక్రమాన్ని పది రోజుల లోపల పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భీమవరం అర్బన్ ప్రాంతంలో 130 గృహాలకు గాను 25 గృహాలు గ్రౌండ్ జరిగడంతో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన సూచించారు. గండ్లూరు వద్ద నిర్మితమవుతున్న జగనన్న కాలనీ పనులను దశల వారీగా పరిశీలించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు అందజేశారు. గండ్లూరు లే అవుట్‌లో 586 గృహాలు మంజూరు కాగా 300 గృహాలు గ్రౌండ్ అయినట్లు సంబంధిత అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నిరంతర విద్యుత్ అందేలా సింగిల్ ఫేజ్ కరెంటును ఏర్పాటు చేయాలని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. అదే విధంగా నీటి సమస్య ఉత్పన్నం కాకుండా చూసుకోవాలని పురపాలక సంఘ కమిషనర్ కొలిమి షమ్మీని ఆదేశించారు. మళ్లీ పది రోజుల తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలనకు వస్తానని, అప్పటికి పనులు పురోగతిని సాధించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పీడీ వేణుగోపాల్, సత్తెనపల్లి మండల రెవెన్యూ అధికారి కె.నగేష్, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, గృహనిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, సంబంధిత శాఖ అధికారులు ఉన్నారు.

గంట ముందుగా అనుమతి

రేపు కానిస్టేబుల్ ఉద్యోగాలకు పరీక్ష

- 19 కేంద్రాల్లో 'ప్రిలిమినరీ'కి ఏర్పాట్లు
- ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష
- హాజరు కానున్న 11,088 మంది అభ్యర్థులు
- అన్ని కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు
- హాల్ టికెట్, పెన్, గుర్తింపు కార్డుకు మాత్రమే అనుమతి
- ఏర్పాట్లపై రేంజ్ ఐజీ సమీక్ష



మాట్లాడుతున్న రేంజ్ ఐజీ సీఎం త్రివిక్రమవర్మ, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి, అదనపు ఎస్పీ బిందుమాధవ్

సాక్షి, నరసరావుపేట: పోలీస్ కానిస్టేబుల్స్ ప్రిలిమినరీ రాత పరీక్ష రేపు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. అందుకు తగిన ఏర్పాట్లను పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి పర్యవేక్షణలో అధికారులు పూర్తి చేస్తున్నారు. జిల్లాలో కానిస్టేబుల్ పరీక్షకు జరుగుతున్న ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ డా.త్రివిక్రమవర్మ శుక్రవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు పాటించవలసిన నియమ, నిబంధనలు, పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ శాఖ తరపున చేస్తున్న భద్రత ఏర్పాట్ల గురించి మీడియాకు వివరించారు.

9 గంటలకే అనుమతిస్తాం

ఆదివారం జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాల్లో 11,088 మంది అభ్యర్థులకు కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారని ఐజీ తెలిపారు. పరీక్షను కాకినాడ జేఎన్‌టీయూ నిర్వహిస్తున్నారని, పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఉదయం 10 గంటల తర్వాత పరీక్ష హాల్లోకి అనుమతి నిరాకరిస్తామన్నారు. ఆ లోగా కేంద్రాలకు చేరుకునేలా సన్నద్ధమవ్వాలని సూచించారు. అభ్యర్థులను మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతే పరీక్షా కేంద్రం నుంచి బయటకు పంపుతామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్ టికెట్ తో పాటు ఏదైనా ఒరిజినల్ గుర్తింపు కార్డు, బ్లాక్ లేదా బ్లూ బాల్ పాయింట్ పెన్ మాత్రమే తెచ్చుకోవాలన్నారు. ఇవికాక మరే ఇతర వస్తువులను అనుమతించమన్నారు. స్మార్ట్ వాచీలు,సెల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వంటివి పరీక్ష కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించమన్నారు. అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లు, పరీక్ష విధులు నిర్వహించే ఇతర సిబ్బంది నియామక బోర్డు వారి విధివిధానాలను తప్పక పాటించాలన్నారు. కేంద్రాలలో మాల్ ప్రాక్టీస్, కాపీయింగ్, ఇతర అవతవకలకు తావులేకుండా ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రంలోకి పంపడం జరుగుతుందన్నారు.

ట్రాఫిక్ సమస్యలపై దృష్టి

నరసరావుపేట పట్టణ సమీపంలో 18 కేంద్రాలలో పరీక్ష కేంద్రాలున్నాయి. ఈ నేపథ్యంలో భారీ సంఖ్యలో అభ్యర్థులు హాజరుకానున్న నేపథ్యంలో పట్టణం, పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా పోలీసు శాఖ చర్యలు తీసుకుందని ఐజీ త్రివిక్రమ వర్మ వెల్లడించారు. కేంద్రాల వద్ద ఎక్కడా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా అవసరమైన మేరకు పోలీసు సిబ్బందిని నియమించి, పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్లతో పర్యవేక్షించనున్నామన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రం వద్ద పర్యవేక్షణ కోసం ఎస్సై స్థాయి అధికారిని నియమిస్తున్నామని, సీఐలు నిరంతరం పర్యవేక్షిస్తారని, 1000 మంది అభ్యర్థులు దాటిన పరీక్షా కేంద్రం వద్ద డీఎస్పీ స్థాయి అధికారి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారని తెలిపారు. మరోవైపు నరసరావుపేట బస్టాండ్ నుంచి సుదూర ప్రాంతాల్లో ఉన్న పరీక్షా కేంద్రాలకు ఆదివారం ఉదయం నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, అదనపు (అడ్మిన్) ఎస్పీ బిందుమాధవ్‌లు పాల్గొన్నారు.

మోసపోకండి...

కానిస్టేబుల్స్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఎవరైనా వస్తే వారి మాటలు నమ్మి మోసపోవద్దని పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి సూచించారు. అటువంటి వారికి డబ్బులు చెల్లించి ఇబ్బంది పడవద్దని, కానిస్టేబుల్స్ ఉద్యోగ ఎంపిక పూర్తి పారదర్శకంగా జరుగుతుందని, ఎటువంటి అపోహలకు తావులేదన్నారు. ఈ సమయంలో దళారులు మోసగించే ప్రమాదముందన్నారు. అటువంటి వారి వివరాలు సమీప పోలీస్ స్టేషన్‌లో తెలియజేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

–వై.రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

రైతుకు విజ్ఞానగని

- పల్నాడు జిల్లాలో 421 రైతుభరోసా కేంద్రాలు
- రబీ సాగులో 116 పొలంబడులు నిర్వహించాలని నిర్ణయం



వైఎస్సార్ పొలంబడిలో అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి (ఫైల్)



వడ్లమూడి వారి పాలెంలో శిక్షణ తీసుకుంటున్న వీఏఏలు

సత్తెనపల్లి: వ్యవసాయంలో రైతులు ఎన్నో ప్రతికూలతలు ఎదుర్కొంటున్నారు. ఏ పంట అయినా రైతుకు సమస్యలు తప్పడం లేదు. వాటిని అధిగమించి రైతును లాభాల బాటలో నడిపించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. విత్తన ఎంపిక నుంచి దిగుబడిని సాధించే వరకు, ఆ తరువాత వాటిని విక్రయించుకునే వరకు అన్నదాతలకు అధికారులు క్షేత్రస్థాయి శిక్షణ ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ ముందుకు నడిపించనున్నారు. పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను అధిగమించేలా రైతులకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నారు.

పల్నాడు జిల్లా వ్యాప్తంగా రబీ వివిధ పంటలకు సంబంధించి ఈ ఏడాది 116 వైఎస్సార్ పొలంబడులు నిర్వహించాలని నిర్ణయించారు. వీటి పరిధిలో పంటల వారీగా పరిశీలిస్తే వరి–58, మొక్కజొన్న–36, శనగ–22 క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా 421 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఒక్కో మండలంలో ఒక్కో పంటను ఎంపిక చేసుకుని వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తారు. 25 ఎకరాల పంటకు సంబంధించి 30 మంది రైతులను భాగస్వాములను చేసి పొలంబడి నిర్వహిస్తారు. నూతన పొలాన్ని ఎంపిక చేసి ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

నేర్పించే అంశాలివే...

యాజమాన్య పద్ధతులపై అవగాహన, నేల స్వభావం, పొలం పరిసరాలపై సమాచారం, ఎరువుల వాడకం, చీడపీడలు, మిత్ర పురుగుల సంరక్షణ, మొక్కల పెరుగుదల దశలపై క్షుణ్ణంగా తెలియజేస్తారు. ప్రతి అంశం బొమ్మ రూపంలో వేసి దాన్ని గుర్తించి రైతులకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా జిల్లా వ్యవసాయ అధికారి, డీడీఏ, ఏడీఏ, ఏవోలు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

కొనసాగేది ఇలా...

వైఎస్సార్ పొలంబడి 14 వారాలు నిర్వహిస్తారు. విత్తనం దగ్గర నుంచి పంట కోత వరకు ఈ విధానం కొనసాగుతుంది. ప్రతి బుధవారం జిల్లా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పంటలు సాగు ప్రదేశానికి తీసుకెళ్లి రైతులకు ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ప్రాథమిక సర్వే ద్వారా గత ఏడాది పంటకు సంబంధించి యాజమాన్య పద్ధతులపై సమాచారం సేకరిస్తారు. ఎక్కడ తప్పులు జరిగాయో తెలుసుకొని మళ్లీ ఆ తప్పు చేయకుండా రైతులకు శిక్షణ ఇస్తున్నారు.

సద్వినియోగం చేసుకోండి



ప్రతి రైతు తప్పక వైఎస్సార్ పొలంబడిని సద్వినియోగం చేసుకోవాలి. పలు అంశాలపై రైతులు ఇచ్చే శిక్షణ, మెలకువలు ఎంతో ఉపయోగపడతాయి. పంట పరిస్థితులపై చార్టులు గీసి వాటిని క్షేత్రస్థాయిలో ప్రదర్శిస్తారు. ప్రణాళిక బద్ధంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నాం.

–ఎస్ శ్రీధర్ రెడ్డి, ఇన్‌చార్జి ఏడీఏ, సత్తెనపల్లి

పదవీ విరమణపై నాలుగు రోజుల్లో జీవో

- రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ హేమచంద్రారెడ్డి
- లాంలో ఏపీ విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల రాష్ట్ర సంఘం సదస్సు

గుంటూరు రూరల్: ఉద్యోగ విరమణ వయస్సును విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందికి 62 సంవత్సరాలకు పెంచుతూ జీవోను మరో నాలుగైదు రోజుల్లో ప్రభుత్వం విడుదల చేయనుందని ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం గుంటూరు శివారు లాంఫాం వ్యవసాయ పరిశోధనా స్థానం ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సంఘం రాష్ట్ర సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు, తదితర జీవోలు సకాలంలో విడుదల అయ్యేటట్టు, విశ్వవిద్యాలయాల బడ్జెట్ సక్రమంగా వచ్చేటట్లు రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రగతిని బోధనేతర సిబ్బంది కృషిని కొనియాడారు. మరింత శ్రమించి విశ్వవిద్యాలయం ఉన్నతికి కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ డాక్టర్ పి.గౌతమ్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, వెంకటప్పారెడ్డి, బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు ఎంఎల్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కె.అమ్మిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఆర్.విజయ్‌కుమార్, ట్రెజరర్ నరసింహారావు, జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, అతిథులను ఘనంగా సన్మానించారు.

నేడు వ్యవసాయ కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి రాక
- ఏర్పాట్లు పూర్తి : డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కళాశాల డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు

బాపట్ల: ప్లాటినం జూబ్లీ వేడుకలకు బాపట్ల వ్యవసాయ కళాశాల ముస్తాబైంది. ఆహ్వాన పత్రికలను కళాశాలల్లో డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. కళాశాల డీన్ మాట్లాడుతూ శనివారం జరిగే ఉత్సవాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే కోన రఘుపతి పాల్గొంటున్నారని తెలిపారు. మొత్తం 1200 మంది పూర్వవిద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. కళాశాల ప్రారంభించి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఒక్కొక్క సంవత్సరానికి సంబంధించిన విద్యార్థితో కళాశాల ప్రాంతంలో ఒక కొబ్బరి మొక్కను నాటించే కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో తయారు చేసిన బీపీటీ 5204 వరి ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక జ్ఞాపికను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 32రకాల వ్యవసాయ, ఫర్టిలైజర్, విత్తన, వ్యవసాయ యంత్రా పరికరాలతో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. యూనివర్సిటీ హెడ్ డాక్టర్ బి.విజయాభినందన, ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీనివాసులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు యామిని లీల, యామిని, స్నేహ, శేఖర్ పాల్గొన్నారు.

క్రీడా ధనలక్ష్మి

- పేదరికాన్ని అధిగమించి రాణిస్తున్న యువతి
- పలు ఆటల్లో అద్భుత ప్రతిభ
- చదువులోనూ సత్తా చాటుతున్న వైనం
- అంతర్జాతీయ స్థాయిలో ఆడటమే జీవిత లక్ష్యమంటూ వెల్లడి



మెడల్స్, సర్టిఫికెట్లతో కోడిరెక్క ధనలక్ష్మి

యడ్లపాడు: పేద కుటుంబంలో పుట్టినా.. ఎన్ని అవరోధాలు ఎదురైనా మొక్కవోని ప్రతిభతో ముందుకు దూసుకెళుతోంది ఈ క్రీడా మాణిక్యం. క్రీడాకారులు సాధారణంగా ఏదో ఓ ఆటలో ప్రావీణ్యం సంపాదించడం పరిపాటి. అయితే పల్నాడు జిల్లా యడ్లపాడుకు చెందిన కోడిరెక్క ధనలక్ష్మి పలు ఆటల్లో అద్భుత ప్రతిభ చూపుతోంది. షూటింగ్‌బాల్, వాలీబాల్, రన్నింగ్, లాంగ్‌జంప్, కుంగ్‌ఫూ తదితర విభాగాల్లో రాణిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటుంది.

ఇదీ కుటుంబ నేపథ్యం

యడ్లపాడుకు చెందిన వ్యవసాయ కూలి అన్నమ్మ పెద్ద కుమార్తె ధనలక్ష్మి. అన్నమ్మ భర్తకు దూరమైన ఎనిమిదేళ్ల నుంచి రోజువారి కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కుమార్తెలను చదివించుకుంటోంది. పిల్లలు భవిష్యత్ బంగారంలా మారాలని వారిని అన్ని విషయాల్లో ప్రోత్సహిస్తోంది.

తల్లి కష్టం తెలిసి..

తల్లి కష్టం తెలిసిన ధనలక్ష్మి పట్టుదలతో చదువుతోంది. క్రీడల్లోనూ ప్రావీణ్యం సంపాదిస్తోంది. ప్రస్తుతం గుంటూరు రూరల్ మండలం బుడంపాడులోని సెయింట్ మేరీస్ ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో పాలిటెక్నిక్ డిప్లమో ఇన్ సీఎస్‌ఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రోజూ ఉదయం, సాయంత్రం క్రీడా మైదానంలో వ్యాయామ ఉపాధ్యాయుల వద్ద శిక్షణ పొందుతోంది.

ప్రతిభకు నిదర్శనాలివే..

ధనలక్ష్మి షూటింగ్‌బాల్ పోటీల్లో ఏడుసార్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అక్కడ రాణించి జాతీయస్థాయి పోటీల్లోనూ సత్తాచాటింది. అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. ఈఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారత జట్టు తరఫున అండర్–17 విభాగం పోటీల్లో పాల్గొననుంది.

- వాలీబాల్ జోన్ స్థాయిలో ద్వితీయ స్థానంలో ప్రతిభ చాటింది.
- పరుగు పందెంలో 4+100 రిలేలో జోనల్ స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి, సెంట్రల్ జోన్‌లోనూ రెండో స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించింది.
- లాంగ్‌జంప్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది.
- కుంగ్‌ఫూలోనూ ఎల్లోబెల్ట్ సాధించింది.

అంతర్జాతీయ పోటీల్లో సత్తాచాటడమే లక్ష్యం

రాష్ట్రస్థాయి అండర్–21 విభాగంలో శనివారం షూటింగ్ పోటీలు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొంటున్నా. రాణించి జాతీయ స్థాయికి వెళ్లనుంది. అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తాచాటేందుకు కష్టపడుతున్నా. ఆటల్లో రాణించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్నది లక్ష్యం. ఆదిశగా ముందుకు సాగుతా. పేదరికంలో ఉన్న కుటుంబాన్ని ఆదుకుంటా.

– కోడిరెక్క ధనలక్ష్మి, క్రీడాకారిణి, యడ్లపాడు

పట్టుదలతో ఆడుతోంది

కేజీబీవీలో చదివేటప్పుడు 8 నుంచి పదో తరగతి వరకు ధనలక్ష్మి క్రీడలపై ఆసక్తి కనబరిచేది. అందుకే ఆమెను ప్రోత్సహించాం. ఇక్కడ తీసుకున్న శిక్షణతో 2020 నుంచి 23 వరకు రాష్ట్ర, జాతీయస్థాయిల్లో సత్తాచాటింది. భవిష్యత్తులో మంచి క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకుంటుంది.

– నాగమల్లేశ్వరి, పీఈటీ, కేజీబీవీ, నాదెండ్ల

జంట హత్యల కేసులో నిందితుడు ఆత్మహత్య

బల్లికురవ: మండలంలోని వేమవరం గ్రామంలో జరిగిన జంటహత్యల కేసులో నిందితుడు గొట్టిపాటి వీరాంజనేయులు (36) శుక్రవారం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలోకి వెళితే.. 2017 మే నెలలో గ్రామానికి చెందిన గోరంట్ల అంజయ్య, వేగినాటి రామకోటేశ్వరరావుల హత్య కేసులో వీరాంజనేయులు నిందితుడు. కోర్టు వాయిదాలకు తిరుగుతూ చిలకలూరిపేటలో మకాం ఉంటూ అక్కడే వ్యాపారం చేసుకుంటూ జీవనాన్ని వెళ్లదీస్తున్నాడు. శుక్రవారం కోర్టు కేసు వాయిదాకు ఒంగోలు వెళ్లి తిరిగి వచ్చి జీవితంపై విరక్తితో చిలకలూరిపేటలోనే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వీరాంజనేయులు భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు.

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభ చాటుదాం

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ రేపు

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

APMDC APMDC FOUNDATION

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

9703013015, 9912671555

District sponsor

VIVA THE SCHOOL BY VVIT

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

మద్యం విక్రయిస్తున్న టీడీపీ నాయకుడు

- గృహంలో పట్టుబడ్డ గోవా మద్యం, నాటు సారా
- తనిఖీలకు వెళ్లిన సెబ్ సిబ్బందిపై దాడి
- ఎస్‌ఐ తులసికి గాయాలు
- నిందితుడి పరార్

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులపై శుక్రవారం టీడీపీ నాయకులు దాడికి పాల్పడి నిందితుడిని తప్పించారు. పమిడిపాడులో టీడీపీ నాయకుడు బండ్ల హరికృష్ణ నిబంధనలకు విరుద్ధంగా మద్యం, నాటు సారా విక్రయాలకు పాల్పడుతున్నాడన్నా సమాచారం సెబ్ ఉన్నతాధికారులకు అందింది. దీంతో నరసరావుపేట ఎస్‌ఐ సురేంద్ర బాబు, సత్తెనపల్లి ఎస్‌ఐ తులసి ఆధ్వర్యంలో సిబ్బంది పమిడిపాడు గ్రామానికి వెళ్లి హరికృష్ణ ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. గృహంలో గోవా రాష్ట్రానికి చెందిన 11 మద్యం బాటిళ్లు, 5 లీటర్ల నాటు సారా గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడు హరికృష్ణను అదుపులోకి తీసుకొన్నారు. స్టేషన్‌కు తరలిస్తుండగా హరికృష్ణ కుటుంబ సభ్యులు, గ్రామంలోని టీడీపీ నాయకులు పోలీసులను అడ్డగించారు. ఎస్‌ఐ తులసిపై దాడికి పాల్పడటంతో చేతికి గాయమైంది. దీంతోపాటు రాళ్ల రువ్వటంతో సిబ్బంది నాగరాజు గాయపడ్డారు. ఈ క్రమంలో పోలీసుల అదుపులో ఉన్న హరికృష్ణ విడిపించుకొని పారిపోయాడు. హరికృష్ణ ఇప్పటికే మూడు అక్రమ మద్యం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. గ్రామంలోని టీడీపీ నాయకుడు పారా నానితో కలిసి గత కొంత కాలంగా హరికృష్ణ అక్రమ మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. దాడికి పాల్పడ్డ వారిలో ఐదుగురిని గుర్తించి స్టేషన్‌కు తరలించారు. అక్రమ మద్యం, నాటుసారాతో పాటు పోలీసు విధులకు ఆటంకం కలిగించిన నేరం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈఎస్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

రీసర్వేలో ప్రతి రైతుకూ న్యాయం

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



అయ్యన్నపాలెం సచివాలయంలో రీసర్వేపై రైతులతో మాట్లాడుతున్న జేసీ శ్యాంప్రసాద్

బొల్లాపల్లి : ప్రతి రైతుకూ రీ సర్వేలో న్యాయం చేస్తామని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంతో పాటు అయ్యన్నపాలెం గ్రామంలోని అగ్రహార అన్‌సర్వే భూములను శుక్రవారం జేసీ పరిశీలించారు. తొలుత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూముల రికార్డులను తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయ కొత్త భవన నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలని తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. భవన నిర్మాణం మధ్యంతరంగా నిలిచిపోవడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీఆర్వో, గ్రామ సచివాలయ సర్వేయర్లతో సమావేశం నిర్వహించి భూముల రీసర్వే గురించి వివరాలు సేకరించారు. అయ్యన్నపాలెం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రీసర్వే గురించి ఆరా తీశారు. సర్వే నిష్పక్షపాతంగా, పారదర్శకంగా చేసి ప్రతి రైతుకూ న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు చేస్తాం..

శుక్రవారం మండలంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్న జేసీ ఎ.శ్యాంప్రసాద్, గురజాల ఆర్డీవో కె.అద్దెయ్య వరి పంట సాగు చేసిన గ్రామాల గురించి వివరాలు సేకరించారు. ఆయా గ్రామాల్లో పౌరసరఫరాల శాఖ, రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుపుతున్న విధానంపై అధికారులతో చర్చించారు. వరి పండించిన రైతుల నుంచి ప్రతి ధాన్యపు గింజనూ గిట్టుబాటు ధరకు కొనాలని అధికారులను ఆదేశించారు. రైతులకు న్యాయం చేయాలని, ధాన్యం సేకరణ పూర్తయ్యే వరకు యథావిధిగా విధులు నిర్వహించాలని సూచించారు. ఏమైనా అడ్డంకులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

అయ్యన్నపాలెం అసైన్డ్ భూముల పరిశీలన

అయ్యన్నపాలెం గ్రామ పరిధిలో సుమారు రెండు వేల ఎకరాలకు పైగా అన్‌సర్వే, అసైన్డ్ భూములను జేసీ పరిశీలించారు. ఇవి గతంలో ఆక్రమణలో ఉన్నాయని, అయితే సాగులో ఉన్న రైతులకు న్యాయం చేస్తామని జేసీ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. చిన్న, సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న భూములకు రీసర్వే ద్వారా ప్రభుత్వం హక్కు పత్రాలు అందిస్తామని చెప్పారు. అసైన్డ్ భూములను ఆక్రమించుకుంటే చర్యలు తప్పవని, ముందస్తుగా అధికారులు ఆక్రమణలు, అసైన్డ్ భూముల విషయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జేసీ వెంట జిల్లా పౌరసరఫరాల డీఎం వరలక్ష్మి, డీఎస్‌వో జి.మోహన్‌బాబు, మండల సర్వేయర్ శివశ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం

- పెండింగ్ కేసులు త్వరగా పూర్తి చేయండి
- కోటప్పకొండ తిరునాళ్లను జయప్రదం చేద్దాం
- నేరసమీక్షలో గుంటూరు రేంజ్ ఐజీ త్రివిక్రమవర్మ



గుంటూరు రేంజ్ ఐజీ త్రివిక్రమవర్మను సత్కరిస్తున్న పల్నాడు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: పల్నాడు జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేయాలని పోలీసులను గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమ వర్మ ఆదేశించారు. పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కోటప్పకొండపైన ఉన్న సమావేశ మందిరంలో నిర్వహించిన నేర సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న వివిధ కేసుల దర్యాప్తును త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం పటిష్ట ప్రణాళిక అమలు చేయాలన్నారు. చోరీలను అరికట్టడానికి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ముమ్మర గస్తీ నిర్వహించాలన్నారు. పాత నేరస్తులు, జైలు నుంచి విడుదలైన నేరస్తులు, చెడు నడత కలిగిన వారి కదలికలపై దృష్టి సారించాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు, మహిళలపై జరిగిన నేరాల దర్యాప్తుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

శివరాత్రి తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు

ఫిబ్రవరి 18న కోటప్పకొండలో జరగనున్న మహా శివరాత్రి తిరునాళ్ల సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు, ట్రాఫిక్ నిర్వహణ ఏర్పాట్ల గురించి ఐజీ సమీక్ష నిర్వహించారు. ఛాయా చిత్రాల ప్రదర్శన ద్వారా కోటప్పకొండ తిరునాళ్ల జరిగే ప్రాంతాలు, కొండకు వచ్చే మార్గాలు, వాహనాలు నిలుపు పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యల గురించి పోలీస్ అధికారులతో చర్చించారు. తిరునాళ్లకు వచ్చే ప్రభల వివరాలు సేకరించాలని, ఉత్సవాలను విజయవంతంగా పూర్తిచేసేందుకు పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఐజీకి జ్ఞాపికను అందజేసి పల్నాడు అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బిందుమాధవ్, రామచంద్రరాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన బాలురు, బాలికల జట్లు

నరసరావుపేట ఈస్ట్: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలను విక్టరీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం నిర్వహించారు. కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి 150 మంది బాలురు, 60 మంది బాలికలు హాజరయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వి.వీర్లంకయ్య, రిఫరీ బోర్డు చైర్మన్ పి.కృష్ణమూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శి డి.నాగాంజనేయరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎం.రాజశేఖరరెడ్డి, వ్యాయామ అధ్యాపకుడు ఎస్.కృష్ణంరాజు పోటీలను పర్యవేక్షించగా, సెలక్షన్ కమిటీ సభ్యులుగా కె.తిరుపతి రావు, ఆర్.ఆంజనేయులు, కె.సత్యనారాయణ, ఎస్.గురుస్వామి, సురేంద్ర వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి అనకాపల్లిలో జరగనున్న 70వ అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వీర్లంకయ్య తెలిపారు.

బాలుర జట్టు

బి.విజయకుమార్, వై.నజీర్, ఓ.శ్రీహరి, ఎ.సురేష్, షేక్.బాజీ, జి.సైదా, సిహెచ్.లక్ష్మీనారాయణ, పి.గణేష్‌రెడ్డి, జి.శివశ్రీను, జే.అశోక్, పి.శ్యాంసన్, సిహెచ్.వసంతకుమార్, జె.అవినాష్.

బాలికల జట్టు

షేక్.ఫర్మానా, ఎ.మహిత, ఆర్.వాణికోటేశ్వరమ్మ, వి.సంధ్యాబాయి, జి.నందిని, ఎం.కావేరి, వై.అనూరాధ, పి.వైష్ణవి, బి.సాజన్య, డి.హేమలత, ఎం.శిరీష, ఎం.సాత్విక.

'వర్సిటీ' బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ ఎన్.శేఖర్, ప్రావిడెన్సీ సీనియర్ మేనేజర్ రంగవల్లి, ఓలేటి శిరీష తదితరులు

నరసరావుపేట రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారం కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ప్రారంభమయ్యాయి. వర్సిటీ పరిధిలోని గుంటూరు, ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి 12 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. పోటీలను ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ ఎన్.శేఖర్, ప్రావిడెన్సీ గ్లోబల్ సీనియర్ మేనేజర్ గడిపూడి రంగవల్లి, చిలకలూరిపేట నిఖిల టెక్నో స్కూల్ డైరెక్టర్ ఓలేటి శిరీష, ఎంఏఎం ఫార్మసీ కళాశాల కార్యదర్శి ఎంఆర్ శేషగిరిరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి దోహదచేస్తాయని తెలిపారు. ప్రతి విద్యార్థిని తప్పనిసరిగా క్రీడల్లో పాల్గొనే విధంగా కళాశాలల యాజమాన్యాలు ప్రోత్సహించాలని సూచించారు. మొదటి రోజు పోటీల్లో తెనాలి జేఎంజే మహిళా కళాశాల, యూనివర్సిటి కాలేజి ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్‌స్పోర్ట్స్ సైన్సెస్, ఎంఏఎం ఫార్మసీ కళాశాల, ధనలక్ష్మీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ జట్లు పాల్గొన్నాయి. పోటీలకు సెలక్షన్ కమిటీ సభ్యులుగా జీపీఎంఆర్ నీలా కుమారి, డాక్టర్ సిహెచ్. వెంకట్రావు, కె.అరుణ సుజాత వ్యవహరించారు. శనివారం ఫైనల్స్ నిర్వహించనున్నారు.

పరిశ్రమలశాఖ రుణాలపై అవగాహన సదస్సు

నరసరావుపేట ఈస్ట్: అర్హత కలిగిన నిరుద్యోగ యువత పరిశ్రమలు, వ్యాపారాలు నిర్వహించుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలను అందించి ప్రోత్సహిస్తున్నట్టు పల్నాడు జిల్లా పరిశ్రమలశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. వాసవీ డిగ్రీ కళాశాలలో శుక్రవారం పరిశ్రమలశాఖ అందించే రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన జేడీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పీఎం ఉపాధి కల్పన, డాక్టర్ వైఎస్సార్ బడుగు వర్గాల రుణ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర్లు, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బి.దాస్, వాసవి మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ ఏవీఎస్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణకు కృషి చేద్దాం

టీబీ అండ్ లెప్రసీ నివారణ అధికారి డాక్టర్ పద్మావతి



మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

నరసరావుపేట: జిల్లాలో టీబీ నివారణకు ప్రైవేటు పల్మనాలజిస్టు విభాగ డాక్టర్లు, కెమిస్టు అండ్ డ్రగ్గిస్టులు సహకరించాలని టీబీ అండ్ లెప్రసీ జిల్లా పర్యవేక్షణాధికారి అధికారి డాక్టర్ కె.పద్మావతి కోరారు. 2025 నాటికి దేశంలో టీబీ లేకుండా చేయాలనే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ లక్ష్యాన్ని నెరవేర్చేదుకు అందరూ సహకరించాలన్నారు. గతనెల నుంచి టీబీపై సిబ్బంది సర్వే చేస్తున్న నేపథ్యంలో సబ్‌నేషనల్ సర్టిఫికేషన్ సర్వే డాక్టర్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూహెచ్‌వో) ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ విజయకృష్ణ జిల్లాలోని అధికారులు, ప్రైవేటు పల్మనాలజిస్టులు, డ్రగ్స్ అండ్ కెమిస్టు అధికారులతో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వైద్యశాఖ ఆరోగ్య కార్యాలయంలో జరిగిన ఈ సదస్సును డీఎంహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి, టీబీ నివారణాధికారి డాక్టర్ పద్మావతి పర్యవేక్షించారు. డాక్టర్ విజయకృష్ణ గత ఐదేళ్లకాలంలో టీబీ కేసుల నివేదికలను పరిశీలించారు. కెమిస్టు అండ్ డ్రగ్గిస్టులు అధికారుల ఆదేశాల మేరకు మందులు విక్రయిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శోభారాణి మాట్లాడుతూ టీబీ రోగులకు పౌష్టికాహారం అందజేయడంలో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని వెల్లడించారు.